క్లుప్తంగా

దళిత నాయకుడు శ్రీరామ్మూర్తి మృతి



రణస్థలం: విశ్రాంత ఉపాధ్యాయుడిగా, తొలితరం దళిత నాయకుడిగా ఎంతో మందికి సుపరిచితులైన కళ్లేపల్లి శ్రీరామ్మూర్తి బుధవారం మృతి చెందారు. మండలంలోని నారువ పంచాయతీ అక్కయ్యపాలెం గ్రామానికి చెందిన ఆయన మృతదేహానికి శ్రీకాకుళంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీరామ్మూర్తి దళితుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని దళిత సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని, ఆయన లేని లోటు మరువలేనిదని గుర్తు చేసుకున్నారు.

విద్యార్థి డిబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 75 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా బుధవారం సెకండియర్ విద్యార్థులు 19,093 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 427 మంది గైర్హాజరయ్యారు. కాగా లావేరు కేంద్రంలో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఒక విద్యార్థిని అధికారులు డిబార్ చేశారు. కాగా గురువారంతో ఫస్టియర్ జనరల్ కోర్సుల పరీక్షలు ముగియనున్నాయి. 15వ తేదీతో సెకండియర్ జనరల్ కోర్సుల పరీక్షలు ముగుస్తాయి.

పన్నులు చెల్లించకుంటే చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా ఆస్తి, ఖాళీస్థలం, కుళాయి పన్నులను తక్షణమే చెల్లించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొంటివీధి, హడ్కో కాలనీ, సీహెచ్ఎస్ఎన్‌కాలనీ సచివాలయాల్లో పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పన్నులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

క్లాస్ వర్కుపై దృష్టిపెట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో క్లాస్ వర్కుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని వీసీ కె.ఆర్.రజిని సూచించారు. వీసీ ఛాంబర్‌లో బుధవారం సైన్స్ ప్రిన్సిపాల్ ఉదయ్ భాస్కర్, ఆర్ట్స్ ప్రిన్సిపాల్ అనురాధ, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌లతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కొన్ని రోజుల క్రితం సోషల్ వర్కు, ఇంగ్లిష్, ఇంజినీరింగ్ తదితర విభాగాల ఫ్యాకల్టీ మధ్య విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో సజావుగా అకడమిక్ క్లాస్ వర్కు కొనసాగింపు, అధ్యాపకుల సమయపాలన అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు.


నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్లు పరిశీలిస్తున్న డీఈ శ్రీరాములు

రణస్థలం: గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈ సనపల శ్రీరాములు స్పష్టం చేశారు. మండలంలోని జేఆర్‌పురం పంచాయతీ లక్ష్మీనగర్‌లో రూ.25 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబుక్ రికార్డు ప్రాప్తికి కొలతలు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసుకుని బిల్ తయారు చేయాలన్నారు. పరిశీలనలో ఏఈ ఎల్.అప్పన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దివ్య, అఖిల్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేయూత



మూడు చక్రాల కుర్చీ, నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక సింధూర ఆస్పత్రి ప్రాంగణంలో ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు గేదెల చిన్నారావుకు చక్రాల కుర్చీని వైద్యురాలు సింధూర చేతులమీదుగా బుధవారం అందజేశారు. కొంతకాలం క్రితం ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న అతడికి పాలకొండకు చెందిన కొవగాన వాసు అండగా నిలిచి మూడు చక్రాల కుర్చీని అందించారు. అలాగే సునరాపు శ్రీలత మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి, ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, అలంశెట్టి సంతోష్, కొవగాన శంకరరావు, ఉర్లం శివతేజ, బి.జగదీష్, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరేషన్..!

- తంగివానిపేటలో ఆకలి కేకలు
- ఇంకా అందని రేషన్ బియ్యం
- లబోదిబోమంటున్న రేషన్ కార్డుదారులు



రేషన్ బండి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని తంగివానిపేట గ్రామంలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. పెద్దపాడు గ్రామానికి అనుసరించి ఉన్న ఈ గ్రామంలో ఇప్పటివరకు ఈనెల రేషన్ సరుకులు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ రేషన్‌పైనే ఆధారపడిన ఎన్నో కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. అయితే దీనంతటికీ వీఆర్వో, సీఎస్‌డీటీల నిర్వాహకమే కారణమని తెలుస్తోంది.

అసలేం జరిగింది..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో 23 ఏళ్లుగా డీలర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని రాజకీయ కక్షతో తొలగించారు. తంగివానిపేట, పెదపాడుకు చెందిన ఈ డీలర్ షాప్ నంబర్ 9001 కాగా, దీనిలో 556 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం డీలర్ లేకపోవడంతో ఈ కార్డుదారులెవ్వరికీ ఇంతవరకు రేషన్ సరుకులు అందలేదు. మరో రెండు రోజుల్లో ఎంఎల్ఎస్ పాయింట్ క్లోజ్ అవుతుంది. దీంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఈ నెల రేషన్ సరుకులు అందే అవకాశం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గత నెలలో వీఆర్వో థంబ్‌తోనే రేషన్‌ను అందించారు. ఆ తర్వాత కూటమికి చెందిన మరో వ్యక్తికి ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే ఈ–పాస్ మెషిన్ వీఆర్వో అందించారు. దీనికి సీఎస్‌డీటీ వత్తాసు పలకడం కొసమెరుపు. ఇదిలా ఉండగా మండలానికి చెందిన ఎంతమందికి ఇంకా రేషన్ బియ్యం ఇవ్వలేదో పరిశీలించేందుకు ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఫుడ్ కమిషన్ మెంబర్ రెండు రోజుల క్రితం తనిఖీలు చేశారు. అయితే పెదపాడు, తంగివానిపేటకు చెందిన రేషన్ డిపో షాపు నంబర్ 9001లో బియ్యం ఇంకా విడిపించలేదని ఫుడ్ కమిషన్ మెంబర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన ఆరా తీయగా వీఆర్వో, సీఎస్‌డీటీ తప్పిదం ఉన్నట్లు గుర్తించి వారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా గ్రామాల లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. కాగా డీలర్ షిప్ తొలగించిన వ్యక్తి మరలా కోర్టుద్వారా తన డీలర్ షిప్ తెచ్చుకున్నాడు. కానీ అతడికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంలో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది.

రేషన్ బియ్యమే ఆధారం



నాకు ఎవరూ లేకపోవడంతో రేషన్ డిపో నుంచి వచ్చే బియ్యంపైనే ఆధారపడి బతకుతున్నాను. రేషన్ ఎప్పుడు ఇస్తారోనని ఎదురు చూస్తున్నాను. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. రేషన్ సరుకులు త్వరితగతిన ఇప్పించాలి.

– కింజరాపు రాములు, తంగివానిపేట

ఒకటో తేదీ నుంచి తిరుగుతున్నాను



ఈనెల రేషన్ సరుకుల కోసం ఒకటో తేదీ నుంచి అన్నిచోట్లా తిరుగుతున్నాను. ఎక్కడా రేషన్ బియ్యం ఇవ్వడం లేదు. ఈ రేషన్‌పైనే ఆధారపడి మా కుటుంబానికి చెందిన ఆరుమంది బతుకుతున్నాం. రేషన్ తీసుకునేందుకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉంది.

– తంగి అప్పలనర్సయ్య, తంగివానిపేట

అన్నీ కోల్పోయాను



నేను బార్బర్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల రోడ్డు వెడల్పులో భాగంగా పెదపాడులో ఇల్లు కోల్పోయాను. గడిచిన నెలలో ఇక్కడ రేషన్ ఇవ్వకపోవడంతో వేరే ఊరులో తీసుకున్నాను. ఈనెలలో కూడా రేషన్ వస్తుందో లేదోననే భయంగా ఉంది.

– బలగ సింహాచలం, పెద్దపాడు

ప్రజల పక్షాన నిలిచేది వైఎస్సార్‌సీపీనే



శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

రణస్థలం: అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను కొనసాగించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేసి పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎన్నికల్లో ఒక్క వ్యక్తిని ఎదుర్కోలేక కుటిల హామీలు, అసత్య ప్రచారాలతో 9 నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేసేవరకు పోరాడతామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు గురాన మానస, రణస్థలం మండలాధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు గొర్లె అప్పలనర్సునాయుడు, మజ్జి రమేష్, ముద్దాడ రాజశేఖర్, పచ్చిగుళ్ల సాయిరాం, బవిరి రమణ, దన్నాన హరి, నేతల కృష్ణ, పిల్ల తాత, ఉప్పాడ అప్పన్న, యర్రయ్య, గొర్లె రాధాకృష్ణ, కెల్ల రామకృష్ణ, కన్నంనాయుడు, అప్పన్న, షేక్ సైదాల్, కరిమజ్జి రమణ, పిన్నింటి సత్యంనాయుడు, జనార్ధన్ రెడ్డి, గురునాయుడు, రామునాయుడు, కెల్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, డాక్టర్స్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల రామకృష్ణారావు, కార్యదర్శి సీపాన వెంకటరావు, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, చిట్టి జనార్ధనరావు, ఎన్ని ధనుంజయరావు, ఎంఏ బేగ్, మార్పు పృథ్వీ, గొండు కృష్ణ, చిట్టి జనార్ధన, సాధు వైకుంఠరావు, గొండు రఘు, ప్రత్తి అన్వేష్, రౌతు శంకరరావు, సీపాన రామారావు, రుప్ప దివ్య, వై.వి.శ్రీధర్, బొడ్డేపల్లి పద్మజ, గుండ హరీష్, టి.కామేశ్వరి, యజ్జల గురుమూర్తి, పీస శ్రీహరి, పీస గోపి, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, కనపల తేజ, చిట్టి రవి, సీహెచ్ భాస్కరరావు, నల్లపిల్లి భానుప్రసాద్, శిల్లా రమాదేవి, రుప్ప అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.




రణస్థలం: వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ఉపాధ్యాయులకు తప్పని అవస్థలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో రెండోసారి జరిగిన క్లస్టర్స్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 170 క్లస్టర్స్ కాంప్లెక్స్ పరిధిలో.. క్లస్టర్ స్కూల్ హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖాధికారులు ఆధ్వర్యంలో అనేక షరతులు, కండీషన్ల నడుమ సమావేశాలు జరిపారు. కొన్నిచోట్ల ఎలాంటి ఉపయుక్తము లేకుండా నామమాత్రపు సమావేశాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపించాయి. మొదటి క్లస్టర్ సమావేశంలో దొర్లిన పొరపాట్లు, తప్పులు, ఇబ్బందులకు కనీసం పరిష్కారం చూపకుండానే రెండోసారి సమావేశాలు నిర్వహించేసి మమ అనిపించారు. చాలా చోట్ల కరెంట్ కోతలతో సబ్జెక్టు పాఠాలే జరగలేదని తెలిసింది. సెలవు నిబంధనలను కఠినంగా అమలు చేయడం, మెడికల్ లీవ్ తప్ప మరేయే ఇతర సెలవుల్ని ఉపయోగించకోకుండా కఠినతరం చేయడం పట్ల హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయులు సైతం మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం ప్రభుత్వానికి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



పరీక్షా కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మండలంలోని సంతసీతారాంపురంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుంప చిన్నారెడ్డి, గాలి వెంకటరెడ్డి పాల్గొన్నారు,

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని రామాలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం సీతారామచంద్రమూర్తి ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జంక్షన్.. జామ్

ఎచ్చెర్ల మండలంలోని తోటపాలేంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీంతో బుధవారం ఏర్పాటు చేసిన విందు భోజనాలకు గ్రామస్తుల ఆహ్వానాల మేరకు అధిక సంఖ్యలో అతిథులు హాజరయ్యారు. దీంతో గ్రామ పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఎండలో వాహన చోదకులు అనేకపాట్లు పడ్డారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



రోడ్డుపై నిలిచిన ఆటోలు



తోటపాలేంలో రోడ్డుపై నిలిచిన వాహనాలు



బైక్‌లపై వాహన చోదకుల పాట్లు



పొలాల్లో వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం



ప్రయాణికుల పాట్లు

అంతర పంటలపై ఆసక్తి



వర్షాధార ప్రాంతాల రైతులు అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. కుప్పిలి, అజ్జరాం, ఎచ్చెర్ల వంటి గ్రామాల్లో ఎక్కువగా వీటిని సాగు చేస్తున్నారు. కొబ్బరి, అరటి, మిరప, బెండ, మునగ వంటి పంటలు ఒకేచోట అంతర పంటలుగా వేస్తున్నారు. దీనివలన తక్కువ పెట్టుబడి, తక్కువ సాగునీటితో అధిక లాభాలు పొందుతున్నామని చెబుతున్నారు.

– ఎచ్చెర్ల

పట్టించుకోరా..?



శ్రీకాకుళం నగరంలోని డివైడర్ల మధ్యలో మొక్కలను పెంచి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కార్పొరేషన్ అధికారులు చూపిస్తున్న చొరవ సత్ఫలితాలు ఇవ్వడం లేదు. పెంచుతున్న మొక్కలను పశువులు నిత్యం తినేస్తున్నాయి. ఈ విషయంపై పశువుల యజమానులకు ఎన్నిసార్లు వార్నింగ్‌లు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. యజమానులపై కమిషనర్ గట్టిగా చర్యలు తీసుకుందామనుకుంటే ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసి విడిచిపెట్టాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇలా అయితే నగరంలో సుందరీకరణ అసాధ్యమేనని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

వైభవం.. కామదహనోత్సవం



అరసవల్లి: తిరువీధిగా వస్తున్న స్వామివారి ఉత్సవమూర్తులు



అరసవల్లి: కామదహనం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో మూడు రోజుల పాటు జరగనున్న డోలోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం కామదహనోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం వేద మంత్రోచ్చారణల నడుమ కామదహనోత్సవాన్ని ఆలయ ఉద్యానవన తోటలో జరిపించారు.

శ్రీకూర్మంలో...

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుని డోలోత్సవం కామదహనోత్సవంతో ఆరంభమైంది. బుధవారం రాత్రి పల్లకీలో ఊరేగింపుగా కూర్మగ్రామం సమీపంలోని సెగిడిపేట వద్దనున్న ప్రత్యేక మంటపం వద్దకు ఉత్సవమూర్తులు చేరుకున్నాయి. దారి పొడవునా స్వామివారికి భక్తులు హారతులు పట్టగా, గోవింద నామస్మరణ జరిగింది. రాత్రి 10 గంటల తర్వాత ఆలయం వద్ద నుంచి శేష వాహనంపై గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలు, అశ్వ వాహనం మీద లక్ష్మణస్వామి, పుష్పకంపై సీతారాములు, చిన్న పల్లకీపై సుదర్శన్ పెరుమాళ్లు (ఉత్సవ మూర్తులను) తిరువీధి నిర్వహించారు. మంటపం ఆవరణలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం శుద్ధి చేసిన జలాన్ని ప్రత్యేకంగా ఉంచిన కొబ్బరి కమ్మపై జల్లారు. వైదికంగా హోమ క్రతువు పూర్తి తర్వాత దానిలో అగ్నిని తీసుకెళ్లి అక్కడే ఉంచిన కొబ్బరి కమ్మకు నిప్పు పెట్టడంతో కామదహనోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ వైదికులతో పాటు ఈవో జి.గురునాథ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



గార: శ్రీకూర్మనాథాలయం నుంచి బయల్దేరిన ఉత్సవమూర్తులు



గార: హోమ క్రతువు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఎక్కువగా కేసులు ఉండడంతో పరిష్కారం సాధ్యమవ్వదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.నిర్మల, కె.గాయిత్రి, మండల సర్వేయర్ శాంతారావు తదితరులు పాల్గొన్నారు.